క్లుప్తంగా

కొనసాగుతున్న వరినాట్లు



గొల్లపాలెంలో వరినాట్లు వేస్తున్న మహిళలు

కాజులూరు: అగస్టు నెల ప్రారంభమైనప్పటికీ ఈ ఏడాది మండలంలోని పలు గ్రామాల్లో నేటికి వరి నాట్లు కొనసాగుతున్నాయి. జూన్ నెలాఖరు నాటికే నాట్లు పూర్తి చేయాలని వ్యవసాయాధికారులు మొదటి నుంచి చెప్పుకొస్తున్నారు. అయితే రైతులకు ఎదురవుతున్న పలు ప్రతికూల పరిస్థితులు వరి సాగు ఆలస్యానికి కారణమవుతున్నాయి. డెల్టాలో రైతులను మూడు పంటలకు ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ ఏడాది ప్రభుత్వం జూన్ ఒకటో తేదీనే కాలువ నీరు విడుదల చేసింది. అయితే అధిక శాతం రైతులు నారుమడులు వేసుకున్న సమయంలో విడవకుండా భారీ వర్షాలు పడటంతో మొలకలు వచ్చే నారు నీట మునిగి కుళ్లిపోయింది. దీంతో నారు కొరత ఏర్పడటం తదితర కారణాలతో మండలంలో తొలకరి సాగుకు తీవ్ర జాప్యం జరిగింది. అయితే వ్యవసాయాధికారులు ఖరీఫ్ సాగుకు అదును దాటిపోయిందని చెబుతున్నారు కదా..? అని రైతులను అడుగగా.. తమది టైలాండ్ ఏరియా అని వరి తప్ప మరో ప్రత్యామ్నాయ పంటలకు పొలాల్లో అవకాశం లేకపోవటంతో సమయం మించిపోయినప్పటికీ నాట్లు వేయవలసి వస్తుందని రైతులు చెబుతున్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి



అంగర పీహెచ్‌సీ సేవలను వివరిస్తున్న ఎంపీహెచ్ఈఓ మల్లికార్జునుడు

కపిలేశ్వరపురం: ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని అంగర పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం కమిటీ ఛైర్మన్, ఎంపీపీ సత్యవేణి అధ్యక్షతన నిర్వహించారు. ఆసుపత్రి కార్యకలాపాలు, వైద్యసేవలు, ప్రభుత్వ పథకాలు తదితర అంశాలను వైద్యాధికారి పి.రత్నకుమారి వివరించారు. ఎంపీపీ సత్యవేణి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో ఆరోగ్య కార్యక్రమాలను మరింత మెరుగుపర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్సై రంగారావుకు పదోన్నతి



ఎస్సైగా పదోన్నతి పొందిన రంగారావు

మండపేట: టౌన్ స్టేషన్ ఏఎస్సైగా విధులు నిర్వహించి టీఎస్ రంగారావుకు పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన ఏలూరు ఎస్సైగా పదోన్నతిపై వెళ్లినట్టు రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జి సీఐ కొమ్ముల శ్రీధర్‌కుమార్ తెలిపారు. రంగారవు అందించిన సేవలకు గుర్తింపు లభించిందన్నారు.

విరాళాల సేకరణ



ద్రాక్షారామలో వయనాడ్ బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రామచంద్రపురం రూరల్: కేరళలోని వయనాడ్ దుర్ఘటనలో బాధితులైన ప్రజలకు అండగా నిలవడం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ద్రాక్షారామ ఆశా వర్కర్లు పలువురి వద్ద విరాళాలు సేకరించారు. ఈ విధంగా సేకరించిన సొమ్ము రూ.6,381 సీఐటీయూ రాష్ట్ర కమిటీ ద్వారా బాధితులకు అందజేస్తామని ఆశా వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలకా సుభాషిణి తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు హేమ పుష్పలత, కామేశ్వరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

9న కొత్తపేట శతాబ్ది కళాశాలలో మెగా జాబ్‌మేళా

కొత్తపేట: స్థానిక శతాబ్ది డిగ్రీ కళాశాలలో ఈ నెల 9న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కట్టా నాగమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్లోసరీ సాఫ్టెక్ సంస్థ ద్వారా పలు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ కంపెనీల్లో టెక్ మహీంద్ర, సింధు బ్యాంక్, మెడ్‌ప్లస్, అపోలో, శ్రీకృష్ణ ఫార్మా, కార్బోన్, పుజ్జొలన, ఇసుజు, రాక్‌మెన్ తదితర కంపెనీలు పాల్గొనగా ఆయా సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీటెక్ విద్యార్హత గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. సిద్ధార్థ, శతాబ్ది కళాశాలల విద్యార్థులతో పాటు ఇతర కళాశాలల అభ్యర్థులు కూడా ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు.

పంట నమోదుకు గ్రీన్ సిగ్నల్

- ఈ-పంట నమోదుకు అధికారుల చర్యలు
- జియోఫెన్సింగ్‌తో కచ్చితమైన వివరాలు
- ఈ-పంటతో అధిక ప్రయోజనాలు
- 1.01లక్షల ఎకరాల్లో వరిసాగు
- నమోదుకు సెప్టెంబరు 15 తుది గడువు



రాయవరంలో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రాయవరం: ఈ-పంట నమోదుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని కోసం వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసేందుకు ఈ-పంట విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ-పంట నమోదు చేయించుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉంది. ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుకోవాలంటే ఈ పంటలో తప్పనిసరిగా సాగు వివరాలు నమోదు చేసుకోవాలి. గతంలో ఉన్న విధానంలో ప్రభుత్వం స్వల్పంగా మార్పులు చేసింది. ఈ ఏడాది ఈ-పంట నమోదులో కచ్చితమైన సమాచారం కోసం మార్పులు చేపట్టారు. గతేడాది నుంచే జియోఫెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తుండగా, కొత్తగా ఫేషియల్ రికగ్నిషన్, ఈ ఫిష్ డేటా అప్రూవల్, అదేవిధంగా అబ్జక్షనబుల్ ల్యాండ్స్‌లో వేసే పంట నమోదును ఈ-పంటలో చేర్చడాన్ని సులభతరం చేశారు. ఈ విధానంలో రైతుకు, కౌలు రైతుకు ప్రయోజనం ఉంటుంది. కచ్చితమైన సమాచారం ప్రభుత్వానికి చేరుతుంది. ఫలితంగా అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందే అవకాశముంది.

శ్రీకారం చుట్టిన వ్యవసాయ శాఖ

ఈ పంట నమోదుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖలు శ్రీకారం చుట్టాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రైతులు అతివృష్టి, అనావృష్టితో ఎప్పటికప్పుడు నష్టపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో వారు పరిహారం పొందేందుకు అధికారులు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరిగేవారు. వీరి కష్టాలను గుర్తించిన ప్రభుత్వం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సిబ్బందితో రైతు ఫొటోతో పాటు పొలం వద్దే వివరాలు నమోదు చేస్తున్నారు. గతేడాది నుంచి జియోఫెన్సింగ్ విధానం అమలు చేస్తున్నారు. కచ్చితంగా రైతు పొలం వద్దకే వెళ్లి, వివరాలు నమోదు చేస్తేనే యాప్‌లో ఎంటరవుతుంది. దీని వల్ల ప్రభుత్వానికి కచ్చితమైన సమాచారం చేరుతుంది. ఈ-పంట ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతాయి. ప్రస్తుతం వ్యవసాయ సిబ్బంది ఈ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పంట నమోదు సెప్టెంబరు 15వ తేదీతో ముగుస్తున్నందున రైతులు త్వరపడాలని వ్యవసాయ శాఖ సూచిస్తుంది.

మండలం	గ్రామాలు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
ఆర్‌సీపీఎం	25	18,806	9,737
కె.గంగవరం	26	15,633	8,700
కాజులూరు	26	19,382	17,200
మండపేట	12	16,985	11,042
రాయవరం	12	14,646	12,002
కపిలేశ్వరపురం	19	16,333	7,200
మొత్తం	120	1,01,785	65,881

ఈ పంట నమోదు చేస్తారిలా

రైతులు నేరుగా గ్రామ సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి సాగు చేసిన పంట, విస్తీర్ణం, ఎల్‌పీ నంబరు, ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, ఫోన్ నంబరు వివరాలతో నమోదు రిజిస్టేన్ చేయించుకోవాల్సి ఉంటుంది. తొలుత మండల వ్యవసాయాధికారి లాగిన్ నుంచి డేటాను వెబ్ పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేస్తారు. ఈ ఫిష్ డేటా, వెబ్‌ల్యాండ్ డేటా, సీసీఆర్‌టీ డేటా, ఆర్వోఎఫ్ఆర్ డేటా, ఫెరీనియల్ క్రాప్స్ డేటాను డౌన్‌లోడ్ చేస్తారు. ప్రతి గ్రామ వ్యవసాయ శాఖ సహాయకుల పరిధిలో ఉన్న సర్వే నంబర్లు ఎలకేట్ చేయాలి. అనంతరం గ్రామ వ్యవసాయాధికారి లాగిన్‌కు వెళ్తాయి. గ్రామ వ్యవసాయ సహాయకుల లాగిన్‌లో రైతు వారీగా డేటా అప్‌డేట్ చేస్తారు. ఆ వివరాలన్నీ ఈ-పంట యాప్‌లో వస్తాయి. రైతు పంట వివరాలు, విత్తిన తేదీ, నీటి పారుదల, వేసిన పంట రకం తదితర వివరాలను నమోదు చేస్తారు. అనంతరం క్షేత్ర స్థాయిలో రైతు పొలం వద్ద ఫొటోను ఈ-పంట సర్వర్‌కు అప్‌లోడ్ చేస్తారు. సర్వర్‌కు అప్‌లోడ్ చేయగానే రైతు వివరాలు ఈ-పంటలో నమోదవుతాయి. తదుపరి రైతు బయోమెట్రిక్ తీసుకోవడంతో పంట నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది కలసి సంయుక్తంగా ఈ పంట నమోదు చేయాల్సి ఉంది.

రెండు నియోజకవర్గాల పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలో ఖరీఫ్‌లో 1,01,785 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఈ పంట నమోదును ప్రత్యేక యాప్‌లో నమోదు చేయడం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ-పంటలో నమోదైన రైతు సెల్‌కు డిజిటల్ ఎక్నాలెడ్జ్‌మెంట్ వెళ్తుంది. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా ఫిజికల్ ఎక్నాలెడ్జ్‌మెంట్ కూడా ఇవ్వనున్నారు.

పంట వివరాలు పక్కాగా ఉండాలి



రైతులు తమ పంట వివరాలను ఈ-పంటలో నమోదు త్వరగా చేయించుకోవాలి. ప్రతి రైతు తమ పంట వివరాలను పక్కాగా నమోదు చేసుకోవాలి. రైతు సేవా కేంద్రాల ద్వారా సిబ్బంది నమోదు చేస్తారు. దీని ఆధారంగానే రైతులకు లభించే ప్రయోజనాలు చేకూరతాయి. ఈ-పంట నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

ప్రయోజనాలు ఇవీ

- ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం, కార్యక్రమం ఈ-పంట మీదనే ఆధారపడి ఉంటుంది.
- ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏయే పంటలు దెబ్బతిన్నాయో స్పష్టమవుతుంది.
- పంట నష్టపరిహారానికి ఇదే ప్రాతిపదికవుతుంది. రైతుకు ఉచిత పంటల బీమాతో పాటు రైతుల పంట అమ్మకాలకు మద్దతు ధర లభిస్తుంది.
- సున్నా వడ్డీకే పంట రుణాలు ప్రభుత్వం నుంచే లభించే ఇతర ప్రయోజనాలు పొందే వీలుంటుంది.
- ఎరువులు, యాంత్రికీకరణ పరికరాలు తదితర పథకాలతో రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

సగం సగం పనులతో ఫలితం శూన్యం



డ్రైయిన్‌కు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు, గడ్డి

కె.గంగవరం: మండలంలోని అద్దంపల్లి, వద్రపూడి మధ్యలోని అంద్రంగి డ్రైన్ గట్టుకు ఇరువైపులా చెత్త మొక్కలు, గడ్డి పేరుకుపోయి పంటచేలో ఉన్న వర్షపు నీరు కిందికి దిగలేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఇటీవల కె.గంగవరం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాలకు చెందిన వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గడ్డి మందు కొట్టి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే గత రెండు రోజుల క్రితం డ్రైన్స్ శాఖ సిబ్బంది రైతులను, ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా గడ్డి మందు అక్కడక్కడ పిచికారీ చేసి తూతూ మంత్రంగా చేసి వెళ్లిపోయారని రైతులు చెబుతున్నారు. అయితే చిన్న పాటి వర్షానికి కూడా డ్రైన్ నిండిపోయి నీరు కదలడం లేదని, దీంతో పంట చేలో ఉన్న వర్షపు నీరు దిగకపోవడంతో పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైయిన్‌కు ఇరువైపులా గట్టుకు ఆనుకుని సుమారు 150 ఎకరాల పంట పొలాలు ఉన్నాయని ఇది పరిస్థితి ఉంటే పంటలు పండే పరిస్థితి లేదని వారు చెబుతున్నారు. కనీసం అధికారులు వచ్చి సమస్యను చూసి స్థానిక రైతులను సంప్రదించి సమస్యను పరిష్కరిస్తే చాలని వారు అంటున్నారు. సగం సగం పనుల వల్ల ఇబ్బందుల తప్ప ఫలితం శూన్యమని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఊటనీరు. వర్షపు నీరు కిందకి సులువుగా దిగేలా గట్టుకు ఇరువైపులా ఉన్న చెత్తచెట్లు, మొక్కలను, గడ్డిని తొలగించాలని రైతులు, ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బియ్యం అక్రమ రవాణాపై నిరంతర నిఘా

- విజిలెన్సు ఎస్పీ కేవీఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి



అక్రమ బియ్యం నిల్వలను పట్టుకున్న అధికారులు

మండపేట: నిరుపేదల కోసం ప్రజా పంపిణీ వ్యవస్థ సరఫరా చేసే బియ్యాన్ని విక్రయించినా కొనుగోలు చేసినా వారిపై కేసులు నమోదు చేస్తామని విజిలెన్సు ఎస్పీ కేవీఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. మంగళవారం పలు ప్రాంతాల్లో ఆయన తన సిబ్బందితో 36 బస్తాల రేషన్ బియ్యం అక్రమ రవాణాను గుర్తించారు. మారేడుబాక బైపాస్‌రోడ్డులో పంట కాలువ సమీపంలో పశువుల చావిడివద్ద పేదలకు సరఫరా చేసే బియ్యాన్ని విజిలెన్సు అధికారుల స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి రామన్నచౌదరి, దావీదు, అర్జున్‌లపై మండపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రెండు వేల కిలోలకు పైగా రేషన్ బియ్యం పట్టుకున్నారు. వీటి విలువ రూ.91,546 ఉంటాయని నిర్ధారించారు. ఈ తనిఖీల్లో విజిలెన్సు ఎస్ఐ జగన్నాథరెడ్డి, ఏవో భార్గవి మహేష్, కానిస్టేబుల్లు ఎస్‌కే వలీ, సీహెచ్ కిషోర్‌కుమార్, వీరబాబు, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

పవర్ కావాలంటే రూ.100 కట్టాల్సిందే..

- విద్యుత్ సిబ్బంది బరితెగింపు
- అంధకారంలో టిడ్కో కాలనీలో 10 బ్లాక్ ప్రజలు



విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరుతూ రోడ్డెక్కిన టిడ్కో కాలనీ వాసులు

మండపేట: ఇంట్లో విద్యుత్ వెలుగులు కావాలంటే రూ.100 కట్టాల్సిందే లేదంటే మీ ఇష్టమంటూ విద్యుత్ సిబ్బంది మాట్లాడడంతో ప్రజలు అవాక్కయ్యారు. పట్టణంలోని గొల్లపుంత టిడ్కో కాలనీలో రూ.500ల గృహాలకు సంబంధించిన 10వ నంబరు బ్లాకులో మంగళవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆ ప్రాంత వాసులంతా విద్యుత్ ఉపకేంద్రం వద్ద వెళ్లి ఫిర్యాదు చేశారు. సమస్య సాయంత్రం అయినా పరిష్కారం కాలేదు. మరోమారు వెళ్లి అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి విన్నవించారు. ఈ సమయంలో సిబ్బంది రావాలంటే కష్టమని, మీకు అత్యవసర అనుకుంటే ఇంటికి రూ.100 చొప్పున ఇస్తే ప్రైవేటు వర్కర్లను పంపిస్తామని సిబ్బంది తెలిపారు. దీంతో అవాక్కైన కాలనీ వాసులు తాము సొమ్ములు ఇవ్వలేమని తెలిపారు. విద్యుత్ సిబ్బంది తమ వెంట తెచ్చుకున్న కేబుల్ వైర్లను కూడా తిరిగి తీసుకువెళ్లిపోయారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 20 మందికి పైగా కుటుంబాలు ఆ బ్లాక్‌లో నివాసం ఉంటున్నారని, పిల్లా పాపలతో రాత్రంతా ఎలా గడిపేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వారంతా రోడ్డుపై బైఠాయించారు. అయినా సిబ్బంది విద్యుత్ సమస్యను పరిష్కరించలేదు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దృష్టికి సాక్షి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. కాలనీ ప్రజల ఇబ్బంది లేకుండా చూస్తానని ఆయన అన్నారు.

ప్రజాగాయకుడు గద్దర్‌కు నివాళి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రామచంద్రపురం: విప్లవ కవి, ప్రజా గాయకుడు గద్దర్ ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని పట్టణంలోని అంబేడ్కర్ ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహం వద్ద అరుణోదయ, పీడీఎస్‌యూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం గద్దర్ చిత్ర పటానికి ఘనంగా నివాళి అర్పించారు. అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ మాట్లాడుతూ గద్దర్ తన పాటల ద్వారా విప్లవ భావజాలాన్ని దశదిశలా వ్యాపింపజేశారన్నారు. తెలంగాణ పోరాటంలో, ఆయన పాత్ర మరువరానిదన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సాయిచరణ్, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, దుర్గారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'జక్కంపూడి' సేవలు చిరస్మరణీయం

- మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి
- పాపారాయుడు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు



జక్కంపూడికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

మండపేట: మాజీ మంత్రి స్వర్గీయ జక్కంపూడి రామ్మోహన్‌రావు రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు ఆధ్వర్యంలో మంగళవారం జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతిని నిర్వహించారు. మెయిన్‌రోడ్డులోని కామత్ ఆర్కేడ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని పాపారాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి రామ్మోహన్‌రావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ సామాన్య ప్రజల ఆశాజ్యోతిగా జక్కంపూడి వెలుగొందారని కొనియాడారు. పాపారాయుడు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన మంత్రిగా పనిచేసి, మంచి గుర్తింపు పొందారన్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి వీర విధేయునిగా ఉంటూ ఆదర్శవంతమైన నేతగా ఎదిగారన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి భవానీ, వైస్.ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు(నాగబాబు), ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, మాజీ సొసైటీ అధ్యక్షుడు పెంకే గంగాధర్, వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, ముక్కా సుబ్రహ్మణ్యం, శెట్టి నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు పలివెల సుధాకర్, కొప్పిరెడ్డి పద్మావతి, నాయకులు అధికారి శ్రీనివాస్, సాధనాల శివభగవాన్, వాసంశెట్టి శ్రీనివాస్, పైడిమళ్ల రాజు, వాకలపూడి సత్తిబాబు, కర్రి రామలింగేశ్వరరెడ్డి, జంపా తేజసాయి, అయినవిల్లి లాజర్ తదితరులు పాల్గొన్నారు.

దూలం వెంకన్నబాబు ఆధ్వర్యంలో...



రామ్మోహనరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కేశవరం నాయకులు

మండపేట: కేశవరంలో దివంగత మాజీమంత్రి జక్కంపూడి రామ్మోహనరావు జయంతిని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు జక్కంపూడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. వెంకన్నబాబు మాట్లాడుతూ ప్రజా నాయకుడు జక్కంపూడి అని అన్నారు. రాజశేఖరరెడ్డి శిష్యునిగా తనదైన ముద్ర వేసుకున్న ఆయన కుల, మత, వర్గ భేదం లేకుండా తన వద్దకు వచ్చిన వారందరికీ అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అన్నందేవుల కృష్ణారావు(కృష్ణ), మాజీ ఎంపీటీసీలు తుపాకుల ప్రసన్నకుమార్, అన్నందేవుల చంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెదపాటి శివ, మన్నే భూషణం, ముక్కపాటి శ్రీను, అల్లంపల్లి కిషోర్, సలాది శివ, కూసు దొరజీ, పాదపాటి సాయిబాబు, కూసు అబ్బు, విన్నకోట ప్రసాద్, కూసు అమ్మన్న పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి రజతం, ఆరు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారని కోనసీమ జిల్లా తైక్వాండో కార్యదర్శి, సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో మంగళవారం అభినందించారు. త్రిమూర్తులు మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు తాడిపత్రిలో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు జరిగాయన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో ఎ.పవన్‌తేజ రజత పతకాన్ని, జి.జెస్సీలేఖన, ఎం.మౌనిక, జి.లాహితి తేజ, కె.శాలినిశ్రీలు కాంస్య పతకాలు గెలిచారన్నారు. క్యాడెట్ విభాగంలో పి.లక్ష్మీచరణ్య, కేకే సాయిదుర్గ కాంస్య పతకాలు గెలిచారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఎస్సై కె.చిరంజీవి, ఎంఈఓ 1,2లు కె.వెంకటేశ్వరరావు, ప్రకాష్, హెచ్ఎం సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి, పీఈటీ అందె సూర్యకుమారి, ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారన్నారు.

అధ్వానంగా వంతెన నిర్వహణ



దిండి-చించినాడ వంతెనపై నిలిచిన వర్షం నీరు, వెలగని సోలార్ లైట్లు



దిండి వంతెనపై ప్రమాదకరంగా గోతులు

- దిండి-చించినాడ బ్రిడ్జిపై ప్రయాణం నరకం
- వర్షం వస్తే చెరువును తలపిస్తున్న వైనం
- లక్షల విలువైన దీపాలు దొంగల పాలు
- పట్టించుకోని అధికారులు

మలికిపురం: ఉభయగోదావరి జిల్లాల మధ్య దిండి-చించినాడ వంతెన నిర్వహణ అత్యంత అధ్వానంగా మారింది. ఈ వంతెన జాతీయ రహదారుల శాఖ పరిధిలో ఉంది. ఆ శాఖ అధికారులు ఈ వంతెన నిర్వహణను గాలికి వదిలేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వర్షాకాలం వచ్చిందంటే భారీ వర్షాలకు వంతెనపై నీరు ఇలా నిలిచిపోయి ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. వంతెనపై నుంచి మురుగునీరు పోయే హోల్స్ పూడుకుపోవడంతో నీరు వెళ్లే మార్గం లేక ఇలా నిలిచిపోతోంది. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్‌లో వంతెన నాణ్యత దెబ్బతింటుందని నిపుణులు అంటున్నారు. ప్రధానంగా జాతీయ రహదారి వెడల్పు పనులు జరగడంతో పాటు, రైల్వే వంతెనల నిర్మాణం పనుల కారణంగా వంతెనపై భారీ వాహనాల తాకిడి అధికంగా ఉంది. రైల్వే వంతెన పిల్లర్ల పనుల కోసం కాంక్రీటు ట్రాన్స్‌పోర్టు వాహనాల రాకపోకలు నిత్యం జరుగుతుంది. ఇక జాతీయ రహదారి కావడంతో భారీ వాహనాల రాకపోకలు కూడా అధికంగా ఉంటోంది. దీనికి తోడు వేసవిలో ఉభయగోదావరి జిల్లాల మధ్య మట్టి రవాణా అధికంగా ఉంటోంది. మట్టి వంతెనపై పడడం వల్ల వంతెనపై హోల్స్ మూసుకుపోయి వర్షం నీరు కిందికి దిగదు. దీంతో అసలే గోతులు ఉన్న వంతెనపై వర్షం నీరు నిలిచిపోయి తరచూ ఇబ్బంది అవుతుంది. అలాగే వంతెనపై ఏర్పాటు చేసిన సోలార్ లైట్ల వైభోగం కూడా మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. వంతెన నిర్మాణం అనంతరం సుమారు పదేళ్ల తరువాత విద్యుత్ లైట్లు వేశారు. ఎందరో ప్రజాప్రతినిధుల కృషి ఫలితంగా ఎట్టకేలకు దిండి-చించినాడ వంతెనపై ఈ సోలార్ విద్యుత్ వెలుగులు వచ్చాయి. అయితే ఏర్పాటు చేసిన ఏడాది లోపే అవి అంతర్ధానం అయ్యాయి. సుమారు 15 ఏళ్ల క్రితం ఓఎన్జీసీ సహకారంతో నెడ్‌క్యాప్ ద్వారా సోలార్ లైట్లు వేశారు. అప్పట్లో సుమారు రూ.21 లక్షలు వ్యయం అయింది. వంతెన నిర్మించి సుమారు పదేళ్లు పూర్తయినా చాన్నాళ్లకు వెలుగులు రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే లైట్లు వెలిగిన నాలుగు నెలల నుంచి దొంగల బెడద అధికమై బ్యాటరీలు చోరీలకు గురయ్యాయి. దీంతో ఈ వంతెనపై ప్రయాణికులకు కష్టాలు షరా మామూలే. లైట్లు వెలగకపోవడంతో చీకట్లు అలముకుని ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వశిష్ట గోదావరి నదిపై సుమారు రెండు కిలోమీటర్ల పొడవున్న ఈ వంతెనపై రాత్రి వేళలో ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంటోంది. చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఈ వంతెన మారడంతో ఇక్కడి ప్రజానీకం వంతెనపై విద్యుదీకరణ చేయాలని అధికారులను, ప్రజా ప్రతినిధులకు అనేక ఏళ్ల పాటు కోరగా గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (గెయిల్) కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ సర్వీస్ (సీఆర్‌సీ) నుంచి రూ.21 లక్షలు మంజూరయ్యాయి. తొలుత జాతీయ రహదారుల శాఖ అనుమతి లేకపోవడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. నిర్వహణ ఇబ్బంది అవుతుందని జాతీయ రహదారులపై విద్యుత్ లైట్ల ఏర్పాటుకు అనుమతించేది లేదని ఆ శాఖ అధికారులు చెప్పగా అప్పట్లో జిల్లా కలెక్టర్ అనుమతి ఇవ్వడంతో నెడ్‌క్యాప్ అధికారులు పనులు పూర్తి చేశారు. అయితే ఈ లైట్లపై దొంగల కన్ను పడింది. లైట్లు, వీటికి కరెంట్ అందించే విలువైన బ్యాటరీలు క్రమేణా చోరీకి గురయ్యాయి. అలంకార ప్రాయంగా స్తంభాలు మాత్రమే మిగిలాయి. వంతెనపై ప్రయాణికులకు పాత రోజులు షరా మామూలే. లైట్లు వేసిన అధికారులు నిర్వహణ పట్టించుకోకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. చోరీకి గురైన స్థానంలో కొత్తగా లైట్లు వేసి సంసరక్షణ చర్యలు తీసు కోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే వంతెనపై పడిన భారీ గోతులను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.